# అద్దం

**'గోపాలకృష్ణ'**

సాతూ్పరా పర్వతప్రాంతాల్లోవున్న అడవులలో కోయవాళ్లు చాలామందివున్నారు. అచ్చట కొమ్మూరు అనే కోయపల్లె వున్నది. ఆపల్లె చుట్టుప్రక్కల యెక్కడ చూచినా పర్వతాలే. అచ్చటి యువతులకు తామెంత అందముగానున్నారో చూచుకొనుటకు అద్దాలులేవు. అందుచేత తమ ముఖాలు యెలాగు వుంటాయో తెలిసికోవాలంటే, తమ ప్రియులు వానినిగురించి చేసే వర్ణనలమీదనే ఆధారపడియుండవలసి వుంటుంది. వారి వర్ణనలు సాధారణంగా అద్దంకన్న పదిరెట్లు యెక్కువగానే వుంటాయి.

కొమ్మూరులో 'మక్కీడు' అనే యువకుడు ఉండేవాడు. వాడు ఆ అడవుల్లో తిరుగుతూవుండగా చిన్న అద్దం కనిపించింది.

మక్కీడు గుండ్రంగావున్న అపూర్వ వస్తువును పైకితీసి చాలా కుతూహలంగా పరీక్షించాడు. అలాంటి వస్తువు తన జన్మలో యిదివరకెప్పుడునూ చూడలేదు. కాని దాన్ని చూస్తుండగానే, అతనికి దానియందొక విధమైన భయము, గౌరవము, ఆశ్చర్యము కలిగాయి. మాణిక్యంలాగు మెరుస్తూవున్న ఆ వస్తువులో వానికి తనతండ్రి ఆకారము కనుపించింది. "మాతండ్రి! మానాన్న ముఖమే!" అని సంతోషాతిశయంతో అనుకొన్నాడు.

మక్కీడు మెత్తనిఆకులు కోసుకొనివచ్చి చాలా జాగ్రత్తతో అద్దాన్ని వాటిలో చుట్టబెట్టాడు. గౌరవాతిశయంతో దాన్ని దాచుకొన్నాడు. ఇంటికి వెళ్లిన వెంటనే దానిని యెక్కడపెట్టి దాచవలెనో దీర్ఘంగా ఆలోచించి, చివరకు చూరులో దాచడానికి నిశ్చయించినాడు. ఈ సంగతి యెవ్వరితోను అతడు చెప్పదలచుకోలేదు. తన ప్రేయసియగు తిమ్మికికూడ ఆ సంగతి చెప్పదలచుకోలేదు. ఎందుకంటే స్త్రీలకు నోట్లో నూగింజరైనా ఆగదని ఆతని దృఢనమ్మకం. తిమ్మితో చెప్పితే త్రిలోకాలు తెలిసిపోతుందేమో అని అతని భయం.

కాని మక్కీడు మాత్రం తన తండ్రిముఖం కనిపించుచున్నదన్న అద్దాన్ని విడిచి చాలాసేపు ఉండలేక పోయేవాడు. తనపని మానేసి ప్రతిరోజూ మధ్యమధ్య యింటికివచ్చి తలుపువేసికొని తన కండ్లార మనస్సుతృప్తిగా ఆబొమ్మకేసి చూచుకొనేవాడు.

కోయ స్త్రీలకుకూడ మనలోవలెనే ఏదైనా క్రొత్తవస్తువుగాని, విషయంగాని కనిపించినప్పుడు దాని పుట్టుపూర్వోత్తరాలన్నీ తెలిసికొంటేగాని తృప్తి కలుగదు. మక్కీడు తాను పరిపరిసార్లు యింటికి రావడం తనను చూచి ఆనందించడానికే అని యెంతచెప్పినా తిమ్మికి బాగా నమ్మకం కల్గలేదు. మొట్ట మొదట ఆతని ప్రణయసూక్తులు విని కాబోలనుకొన్నది. కాని అతడు వచ్చినపుడెల్ల ఆతని ముఖంలో ఒక వింతకళ, ఆశ్చర్యము, భయము మొదలగు భావాలు కనిపిస్తూ వచ్చాయి.

అప్పటినించీ తిమ్మి ఈ సంగతేమిటో కనుక్కోవాలని నిశ్చయించుకొని మక్కీడుచేసే కార్యాలన్నీ జాగ్రత్తగా చూడ్డం మొదలెట్టింది. త్వరలోనే ఆవిడ మక్కీడు ప్రతిరోజూ ఒంటరిగా కొటలోనికి

వెళ్లి ఏదో చూచి వస్తూండడం గమనించింది. ఆ విషయాన్ని పరిశోధించాలనుకొంది. కాని యెప్పుడు వెదకినా యేమీ కనుపించేదికాదు. చిట్టచివరకు ఆమె ప్రయత్నం సఫలమైంది.

ఒకనాడు మక్కీడు పెరటిలో ఉండగానే తిమ్మి హఠాత్తుగా వెళ్లింది. అప్పుడే మక్కీడు చూరులో ఏదో సర్దుతూవున్నాడు. అప్పటి మట్టుకు తిమ్మి యేమీ మాట్లాడలేదు; కాని అతడు వెళ్లిపోయిన తక్షణమే తిమ్మి పెరటిలోనికి పరుగెత్తింది. తిన్నగావెళ్లి చూరులో వెదకడం మొదలెట్టింది. ఆకుల్లో చుట్టపెట్టి వున్న అద్దాన్ని పైకి తీసింది. ఆశ్చర్యంగా దానిలోనికి చూచింది. అదీ ! తెలిసింది, దానిలో చూడగానే, మక్కీడు దాచివుంచిన రహస్యం !

తిమ్మి తాను చూచినది తానే నమ్మలేకపోయింది. స్త్రీ ముఖమొకటి తనముందర ఆ వస్తువులో గానవచ్చింది. ఇదా మక్కీనికి తనపైనున్న ప్రేమకు తార్కాణము ?

తిమ్మి మనస్సులో పరిపరి విధాలుగా ఆలోచించింది. ఆమె దీనత్వము, చింత, వర్ణించడానికి గదా, మక్కీడు మాటిమాటికి ఆ పెరటిలోనికి పోయేవాడు ! గుట్టు బయటబడింది యెలాగైతేనేం !

ఆమె విచారం హఠాత్తుగా కోపంగా మారిపోయింది. అదేమైనా అందంగావుందా ? ఆముఖం చూస్తే పూరకోతిలాగవుంది. అసహ్యాం, డోకు పుట్టిస్తూంది ఆముఖం. అటువంటి స్త్రీని మక్కీడు ఎట్లు ప్రేమించగలిగాడు ?

తిమ్మికి జీవితంలోని సౌఖ్యం ఒక్క దెబ్బతో తుడిచివేసినట్లు తోచింది. చేతులోని అద్దం అప్రయత్నంగా పట్టువదలి ఒడిలో పడిపోయింది. పెరటిలో తిమ్మి క్రింద నేలమీద పడి దొర్లుతూ ఏడుస్తూవుంది. మక్కీడు ఇంటికివచ్చి ' తిమ్మీ ' అని పిలిచాడు. పలకలేదు. ' ప్రేయసీ ' అన్నాడు.

' నేను కాదు ప్రేయసిని. మిమ్మల్నే దైవంగా నమ్మియున్న నన్ను మీరు యిలాగ చెయ్యడం మీకు న్యాయమేనా ? ' అంది తిమ్మి కంట నీరుపెట్టుకొంటూ.

' నాకేమీ అర్థం కావడంలేదు. ఏమిటీగోల ? ' అన్నాడు మక్కీడు ఆశ్చర్యంతో.

' అవును. మీ కర్థంకాదు. ఎందుకర్థం అవుతుంది ? స్త్రీ చిత్రాలు ఇంటిలో దాచుకోవడం అర్థం అవుతుందికాని యింకేమీ అర్థంకాదు, పాపం. ఇదిగో మీ ప్రేయసి బొమ్మ. తీసికెళ్లండి. ' అని యేడవడం ప్రారంభించింది తిమ్మి.

' తిమ్మీ, నీకేమి పిచ్చియెత్తిందా ? ఇది మా నాన్నగారి బొమ్మ. ఆయన చనిపోయి యిప్పటికి పదేండ్లయినా, యిందులో ఆయన ముఖము బ్రతికి వున్నట్టు సరిగా కనిపిస్తూవుంది. నాకిది ఒక రోజున అడవిలో దొరికింది. అప్పటినుంచి, నేను దీనిని చూరులో పెట్టి దాచుకున్నాను. ' అని మక్కీడు స్పష్టపరిచాడు.

అంత అబద్ధం మరొకటి వుండదనిపించింది తిమ్మికి. చేసిన తప్పుకితోడు అబద్ధంకూడా చెప్తున్నాడని తిమ్మికి కోపం ఉబికి వచ్చింది.

మక్కీడు ఓర్వలేక పోయాడు. ఏదోషమూ యెరుగని తన్ను నిందించు చున్నందులకు అతనికి చాలా విచారమూ, రోషమూ కలిగింది. దాంతో, నాలుగు చీవాట్లూ పెట్టాడు తిమ్మిని. అంతకంతకు పెద్ద గల్లంతుగా తేలింది. అప్పుడు ముసలి పురోహితుడొకడు ఆ త్రోవను పోతూ, వీధి తలుపు తీసి వుండడంవలన, యింటిలో యేదో గల్లంతుగావుంది చూచిపోదామని లోపలకు వచ్చాడు.

'ఏమిటీ గడబిడ ? యీ దెబ్బలాట యేమిటి ?' అని తిమ్మిని, మక్కీడునీ అడిగాడు పురోహితుడు.

'అయ్యా! నాభార్యకు పిచ్చి యెత్తినట్లుంది. ఈమె నామీద వట్టి నీలాపనిందలు వేస్తోంది.' అని తిమ్మికేసి చూచాడు.

'బాబుగారు, నేనన్న దానిలో యేమీ అబద్ధంలేదండి. ఇదిగో చూడండి, యీయన యెవరిదో ఆడుదాని చిత్రమును దాచికొని మాటి మాటికి చూచుకుంటూ వుంటారు.' అంది తిమ్మి.

'నేను ప్రమాణంచేసి చెప్తున్నాను. నాదగ్గర వున్నబొమ్మ మా నాన్నగారిదిగాని యింకెవరిదీ కాదు.' అన్నాడు మక్కీడు దృఢంగా.

'సరే, ఎందుకీ వాదం ? ఏదీ, ఆ బొమ్మయేదో యిలా యివ్వండి, నేను చూస్తాను.' అని పురోహితుడు మధ్యవర్తిత్వం చేయబోయాడు.

అద్దాన్ని పురోహితుడి చేతులోపెట్టారు దంపతులు.

పురోహితుడు అద్దానికేసి తేరిపారి చూచాడు. అది చూడ్డంతోనే ఆతనికి ఆశ్చర్యం, గౌరవమూ, భయమూ, ఒక్కసారి కలిగాయి. అందులో కనుపడ్డ బొమ్మకి సగౌరవంగా నమస్కారంపెట్టాడు. ఆ నమస్కారాన్ని ఆ బొమ్మ ప్రతి నమస్కారంతో అందుకొంది. తిమ్మినీ మక్కీడునీ చూచి పురోహితుడీలాగన్నాడు. 'దీనివిషయమై మీకేమీ వాదం అవసరంలేదు. ఇంక శాంతించండి యిద్దరూకూడా. మక్కీడూ, యిది నీ తండ్రి బొమ్మాకాదు, స్త్రీ ముఖమూకాదు, ఇది యెవరో ఒక మహానుభావుడగు పురోహితుని బొమ్మ. ఇది నేను తీసుకొనివెళ్లి నాపూజా మందిరములో దాచుతాను.'

పురోహితుడప్పుడు వాళ్లి ద్దరనూ ఆశీర్వదించి, యింత గడబిడకూ మూలకారణమైన అద్దాన్ని పట్టుకు వెళ్లిపోయాడు.

## అభ్యుదయము

చిరుకరి వెలుగుల
దినపతి బింబం
తూరుపు దెసనే
పొడిచింది.

వెలివెలి చీకటి
చిటుక లోననే
ప్రొద్దు వెలుగులో
కరిగింది.

మానిని కోరే
మానవలోకం
నీతి హీనతలో
సమసింది.

మహిళల వలచే
మాన్యప్రపంచం
మహామహి తినే
లేచింది.

ప్రకృతి భాగ్యం
ప్రణయ ప్రభావం
తెలుసుకు
తెలిపే
భావౌన్నత్యత
ప్రబలింది.

పైపై రంగుల
వర్ణన చేసే
ప్రాత జబ్బులీ
క్రొత్త సొబగులో
అణిగేయి.

నవ కవులారా !
యువ నటులారా !
నవ్య మహోదయ
పాంచ జన్యమున
సుస్వర శ్రుతిలో
భావగీతికలు పాడండి
ప్రణయ నాటికలు ఆడండి.

భావ గీతికల
హృద్యారావములు
ప్రణయ నాటికల
లాస్య భాగములు
పాంచ జన్యపూ
పంచమ స్వరమూ
విశ్వం నిండాలి.

దెసలను దాగొను
వేలుపు పెద్దలు
ఎదుటికి రావాలి.

—శ్రీమతి జయంతి లక్ష్మీమంగతాయి.